విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

PUBLISHED: HYDERABAD, JANGAON సంపుటి :01 సంచిక :23 బుధవారం 24 జూన్ 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

## పేరు పెట్టండి.. రూ.లక్ష గెలవండి
## తెలంగాణ సర్కార్ బంపర్ ఆఫర్



2 లో

**న్యూస్ డెస్క్, 23 జూన్ (తెలుగు గళం):** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలిసారిగా అల్పాదాయ వర్గాలకు క్యూర్ ఏరియాలో ప్రతిపాదించిన లక్ష ప్లాట్ల నిర్మాణ పథకానికి పేరు ఖరారునకు హౌసింగ్ బోర్డు వినూత్న ప్రయత్నం చేపట్టింది. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకానికి మంచి పేరును నేరుగా ప్రజల నుంచే స్వీకరించాలని హౌసింగ్ బోర్డు నిర్ణయించింది.

# పీఏసీఎస్ పదవుల పంచాయితీ

- ఎమ్మెల్యేల వద్ద ఆశావహుల క్యూ
- నామినేటెడ్ పోస్టులకు పెరిగిన డిమాండ్
- 908 సంఘాల్లో నియామకాల కసరత్తు
- చైర్మన్‌తో పాటు 12 మంది సభ్యులు
- సభ్యత్వం ఉన్నవారికే అవకాశం
- పాతవారికే తొలి ప్రాధాన్యం
- ఆరు నెలల కమిటీల ఏర్పాటు
- 110 సంఘాల పేర్ల స్క్రూటినీ
- ఎంపికలో ఎమ్మెల్యేలకు తలనొప్పి
- కొత్త సభ్యత్వాలపై భారీ ఆసక్తి
- 11,778 మందికి రాజకీయ అవకాశం
- ఖరీఫ్‌కు ముందే కమిటీల ఏర్పాటు
- రైతు సేవలపై ప్రభుత్వం ఫోకస్
- త్వరలో చైర్మన్ల ప్రకటన



మిగతాది 2 లో..

**న్యూస్ డెస్క్, 23 జూన్ (తెలుగు గళం):** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు నామినేటెడ్ పద్ధతిలో పాలకమండళ్లు నియమిస్తుండటంతో అధికార కాంగ్రెస్ నుంచి తీవ్ర పోటీ ఏర్పడింది. తమకు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యేల చుట్టూ స్థానిక నేతలు చక్కర్లు కొడుతున్నారు. ఆ పదవి రావాలంటే ఖచ్చితంగా సహకార సంఘంలో సభ్యులై ఉండాలి. లేకుంటే వారికి ఈ పదవి వరించే ప్రాప్తి లేదు. ఈసారి నియమించే పదవులకు ఆరు నెలల గడువు ఉండటంతో చాలా వరకు పాత వారికే అవకాశం ఇస్తున్నారు. తరువాత చేపట్టే పదవులు 2 సంవత్సరాలకు ఉండటంతో కొందరు ఇప్పటి నుంచే భూములు పట్టాలు చేసుకుంటున్నారు. తరువాత ప్రభుత్వం సభ్యులుగా చేరేందుకు నోటిఫికేషన్ ఇస్తే సభ్యత్వం తీసుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు.

908 సహకార సంఘాలు

రాష్ట్రంలో 908 ప్రాథమిక సహకార సంఘాల ఉండగా వాటిలో 34,86,422 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. గత ఐదారేళ్ల నుంచి ఈ సంఘాల్లో సభ్యత్వాల జాడ లేదు. రాజకీయ నాయకులు కూడా వాటిపై పెద్ద ఆసక్తి చూపలేదు. ప్రభుత్వం నామినేటెడ్ విధానం తీసుకురావడంతో పీఏసీఎస్‌లకు ఆదరణ పెరిగింది. ప్రత్యక్షంగా రాజకీయాల్లో పోటీ చేయని వారంతా సహకార సంఘాల్లో పదవులు దక్కించుకునేందుకు క్యూ కట్టారు. రాష్ట్రంలో ఇప్పటివరకు భూములు కలిగిన రైతులు 73 లక్షలు ఉంటే ప్రస్తుతం సహకార సంఘాల్లో సగం మంది ఉన్నారు. ఒక వేళ సభ్యులుగా చేరేందుకు నోటిఫికేషన్ వస్తే మరో 15 లక్షల మంది చేరవచ్చని సహకార శాఖ అంచనా వేస్తోంది. కొత్తగా చేరి వారికి రూ. 10 వేల సభ్యత్వం పెడితే ప్రభుత్వానికి మరింత ఆదాయం రావచ్చని అభిప్రాయపడుతుంది. ఆ శాఖ అధికారులు ఈ నెలాఖరులో కొన్ని సంఘాలకు కమిటీ నియమించాలని స్థానిక ఎమ్మెల్యేల నుంచి సిఫారుసు లేఖ తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు 110 సంఘాలకు అభ్యర్థుల పేర్లు రాగా వాటిని స్క్రూట్నీ చేస్తున్నారు. వీలైనంత త్వరగా చైర్మన్లను ప్రకటించాలని మంత్రి తుమ్మల ఆదేశించడంతో అధికారులు ఎంపిక ప్రక్రియలో మునిగిపోయారు.

## మెట్రో విస్తరణకు లైన్ క్లియర్
## త్వరలోనే నివేదిక



2 లో

## వాహనదారులకు అదిరిపోయే గుడ్ న్యూస్
## ఆ నిబంధనల్లో భారీ ఊరట!



2 లో


## ముగిసిన ఏపీ కేబినెట్ భేటీ
### ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త



2 లో

**న్యూస్ డెస్క్, 23 జూన్ (తెలుగు గళం):** సీఎం చంద్రబాబు అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశం ముగిసింది. ఈ భేటీలో రాష్ట్ర పారిశ్రామిక ప్రగతి, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా పలు చారిత్రాత్మక నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేబినెట్ భారీ ఊరటనిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. 2004 కంటే ముందు ఉద్యోగాల్లో చేరిన వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది.

# అయోధ్య రామాలయం
# విరాళాల గోల్‌మాల్



2 లో

**న్యూస్ డెస్క్, 23 జూన్ (తెలుగు గళం):** దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించబడిన అయోధ్య రామలయం విరాళాల్లో గోల్ మాల్ జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు యూపీ ప్రభుత్వం పూర్తి స్థాయి విచారణకు సిట్ ను ఏర్పాటు చేయగా.. అన్ని కోణాల్లో పూర్తిగా విచారించారు. అయోధ్య శ్రీరామ జన్మభూమి ఆలయానికి భక్తులు సమర్పించిన విరాళాలు, నగదు, బంగారు, వెండి కానుకల మళ్లింపు (దుర్వినియోగం) ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మంగళవారం ఉదయం తన ప్రాథమిక నివేదికను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి సమర్పించింది. లక్నో డివిజనల్ కమిషనర్ విజయ్ విశ్వాస్ పంత్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల సిట్ బృందం, ఈ నివేదికను యూపీ హోంశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సంజయ్ ప్రసాద్‌కు అందజేసింది.

## నేరస్థుల్ని తయారుచేసే ఫ్యాక్టరీ
## వైసీపీ : మంత్రి నిమ్మల




2 లో

**న్యూస్ డెస్క్, 23 జూన్ (తెలుగు గళం):** నేరస్థులను తయారుచేసే ఫ్యాక్టరీ వైఎస్సార్సీపీ పార్టీ అని, బూతునేతలకు ఆ పార్టీపేరు కేరాఫ్ అడ్రస్ గా మారిందని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. కేబినెట్ సమావేశానికి ముందు సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ, జగన్ లపై విమర్శలు గుప్పించారు. కాపు నేతలను బూతునేతలుగా మార్చి.. జగన్ వారి జీవితాలను నాశనం చేస్తున్నారని దుయ్యబట్టారు.

# చేయూత పెన్షన్లలో భారీ ప్రక్షాళన
## అనర్హులపై పెరిగిన ఫోకస్!

**న్యూస్ డెస్క్, 23 జూన్ (తెలుగు గళం):** చేయూత పెన్షన్ పథకాన్ని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన లైవ్ అథెంటికేషన్ ప్రక్రియ ఫలితాలు ఇస్తోంది. బ్యాంకు ఖాతాల ద్వారా పెన్షన్లు పొందుతున్న 19.04 లక్షలకుపైగా లబ్ధిదారుల్లో ఇప్పటి వరకు దాదాపు 15.93 లక్షల మంది లైవ్ అథెంటికేషన్ పూర్తి చేసుకున్నారు. ఇప్పటివరకు మొత్తం లబ్ధిదారుల్లో 83.88 శాతం మంది లైవ్ అథెంటికేషన్ పూర్తి చేసుకున్నారు. ఇంకా మూడు లక్షలకుపైగా మంది ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ ద్వారా వేలాది అనర్హులను గుర్తించారు. ప్రజాధనాన్ని కాపాడుతూ, నిజమైన అర్హులకు సంక్షేమ ఫలాలు చేరేలా ప్రత్యేక పరిశీలన కార్యక్రమాన్ని ప్రభుత్వం కొనసాగిస్తోంది. అనర్హులు అనేక మంది చేయూత పింఛన్లు పొందుతున్నారని ఫిర్యాదులు అందిన నేపథ్యంలో లైవ్ అథెంటికేషన్ ప్రక్రియను చేపట్టారు. దీనికి ప్రత్యేక పరికరాలను కొనుగోలు చేసి ఇచ్చారు.

ఇంటింటికీ వెళ్లి పరిశీలన

లైవ్ అథెంటికేషన్ సందర్భంగా గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి పరిశీలన చేపట్టారు. ఈ క్రమంలో ఇప్పటికే మరణించిన 41 వేల మందికి పైగా లబ్ధిదారుల పేర్లపై పెన్షన్లు కొనసాగుతున్న విషయం వెలుగులోకి వచ్చాయి.



2 లో

## ముగిసిన ఏపీ కేబినెట్ భేటీ.. ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

మొదటి పేజీ తరువాయి



తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 11 వేల ఉద్యోగులకు నేరుగా ప్రయోజనం చేకూరనుంది. రిటైర్మెంట్ కాలంలో భద్రత కల్పించే ఈ నిర్ణయం ద్వారా ప్రతి ఉద్యోగికి సగటున దాదాపు రూ.3 కోట్ల వరకు లబ్ధి చేకూరుతుందని అంచనా వేస్తున్నారు.

రూ.34 వేల కోట్ల పెట్టుబడులు.. 35 వేల కొత్త ఉద్యోగాలు


రాష్ట్రంలో పెట్టుబడుల స్థాపన, నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తూ మంత్రివర్గం కీలక ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం ముద్ర వేసింది. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ద్వారా ప్రతిపాదించిన దాదాపు రూ.34 వేల కోట్ల భారీ పెట్టుబడుల స్థాపనకు కేబినెట్ అనుమతులు మంజూరు చేసింది. ఈ పరిశ్రమలు, ప్రాజెక్టులు అందుబాటులోకి రావడం ద్వారా రాష్ట్రంలో కొత్తగా 35 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

రాజధాని, మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు

రాజధాని ప్రాంతంతో పాటు న్యాయవ్యవస్థకు సంబంధించిన మౌలిక సదుపాయాల కల్పనపై కేబినెట్ ప్రత్యేక దృష్టి సారించింది. ఉండవల్లి పరిసర ప్రాంతాలలో అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ. 426 కోట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపారు. ఇక రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ శాశ్వత భవన నిర్మాణ పనుల కోసం రూ.139 కోట్ల వ్యయంతో పనులు చేపట్టేందుకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

## పేరు పెట్టండి.. రూ.లక్ష గెలవండి తెలంగాణ సర్కార్ బంపర్ ఆఫర్

మొదటి పేజీ తరువాయి




ప్రజల నుంచి వచ్చిన పేర్లలో ఉత్తమమైనదిగా ఎంపికైన పేరును సూచించిన వారికి ఒక లక్ష రూపాయల బహుమతిని అందచేస్తామని, సోషల్ మీడియా వేదికగా ఈ అంశంలో బహిరంగ పోటీని నిర్వహిస్తున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వీపీ గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. క్యూర్ పరిధిలో అల్పాదాయ వర్గాల ప్రజల కోసం ప్రత్యేకంగా లక్ష ఇండ్లను నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంతర్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే.

ఎటువంటి వివాదాలు లేకుండా, అందుబాటులోని ధరల్లో వివిధ వర్గాల ప్రజల సొంత ఇంటి కలలను నెరవేర్చడంలో హౌసింగ్ బోర్డుకు మంచి పేరు ఉంది. అంతే కాకుండా బోర్డు ఆధ్వర్యంలో చేపట్టి ప్రాజెక్టులకు ప్రజల నుంచి ఆదరణతో పాటు డిమాండ్ కూడా ఉన్నదని ఆయన గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో సుదీర్ఘం కాలం తరువాత చేపడుతున్న ప్రాజెక్టులో ప్రజలను కూడా భాగస్వామ్యులను చేయాలన్న ఆలోచనతో, ప్రజల నుంచి అందే సూచనలతోనే ఈ పథకానికి పేరును కూడా ఖరారు చేయాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 28 వరకు సోషల్ మీడియాలో ఇందుకు సంబంధించిన పోటీని నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు సూచించిన పేర్లలో ఉత్తమమైనదిగా ఎంపికైన దానికి లక్ష రూపాయలను బహుమతిగా ఇస్తామన్నారు.

హౌసింగ్ డిపార్ట్ మెంట్‌కు చెందిన tghd.official పేరుతో ఉన్న ఇన్‌స్టాగ్రామ్ https://www.instagram.com/p/DZ6mCF_E1PY/ ద్వారా పోటీలో పాల్గొనవచ్చని వివరించారు. క్యూర్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎల్ ఐజి ప్లాట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని, ఇందుకు అవసరమైన భూములను ఇప్పటికే గుర్తించామని వివరించారు. ఇందుకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, లాటరీ పద్ధతిలో ఇండ్లను కేటాయిస్తామని, పూర్తి విధివిధానాలను త్వరలోనే ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

## వాహనదారులకు అదిరిపోయే గుడ్ న్యూస్ ఆ నిబంధనల్లో భారీ ఊరట!



**న్యూస్ డెస్క్, 23 జూన్ (తెలుగు గళం):** దేశంలో వాహనాల సంఖ్య రోజు రోజుకు గణనీయంగా పెరిగిపోతుంటే అంతే వేగంగా కాలుష్యం కోరలు చాస్తోంది. దీనికి గడువు తీరిన వాహనాలు ఒక కారణమైతే.. కాలుష్య ధ్రువీకరణ చేసుకోకుండా యథేచ్ఛగా తిరిగే వాహనాలు మరో ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో దేశంలో వాహనాల కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్ల జారీ విధానంలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులు తీసుకురావడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. 'పీయూసీసీ 3.0' పేరుతో కొత్త విధానాన్ని ప్రవేశపెట్టేందుకు రవాణా శాఖ కసరత్తు చేస్తోందని ఇందులో భాగంగా బీఎస్ 6 వాహనాదారులకు భారీ ఊరట కల్పిస్తూ బీఎస్ 4 వాహనదారులకు బిగ్ షాక్ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పీయూసీసీ మార్పులపై తాజాగా జాతీయ మీడియాలో వస్తున్న కథనాలు చర్చగా మారాయి.

ఇకపై మూడేళ్లకోసారి రెన్యువల్:

ప్రస్తుతం ఏదైనా వాహనం రోడ్లపై ప్రయాణం చేయాలంటే పొల్యూషన్ అండర్ కంట్రోల్(పీయూసీ) సర్టిఫికెట్ తప్పనిసరి. అయితే ఇప్పటి వరకు పీయూసీ సర్టిఫికెట్ రెన్యువల్ ప్రతి యేడాది చేసుకోవాలనే నిబంధనలో కీలక మార్పులు చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మార్పుల్లో భాగంగా ఇకపై ఆరు సంవత్సరాల లోపు వయసు కలిగి ఉన్న బీఎస్ 6 ప్రైవేట్ వాహనాలకు పీయూసీసీ సర్టిఫికేట్ రెన్యువల్ ను 3 మూడేళ్లకు పెంచే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. బీఎస్-6 వాహనాలు పర్యావరణానికి తక్కువ హాని కలిగిస్తాయి. ఎస్-4 వాహనాలతో పోలిస్తే బీఎస్-6 వాహనాలు 82 శాతం తక్కువ పర్టిక్యులేట్ మ్యాటర్, 25 శాతం తక్కువ నైట్రోజన్ ఆక్సైడ్లను విడుదల చేస్తాయి. ఈ నేపథ్యంలో ఆరేళ్ల లోపు వయసున్న బీఎస్-6 ప్రైవేట్ వాహనాలకు పొల్యూషన్ సర్టిఫికెట్ చెల్లుబాటు కాలాన్ని 3 సంవత్సరాలకు పొడిగించాలని అదే సమయంలో ఆరేళ్ల కంటే పై వయసు ఉన్న వాహనాలకు ఏడాదికి ఒకసారి పీయూసీసీ రెన్యువల్ చేసుకునేలా మార్పులు తీసుకురాబోతున్నట్లు తెలుస్తోంది.

బీఎస్ 4 వాహనదారులకు షాక్:

ఇక మార్చి 2020 కంటే ముందు తయారైన పాత బీఎస్-4 ప్రైవేట్ వాహనాలకు ప్రస్తుతం ఏడాదికి ఒకసారి ఉన్న నిబంధనను మార్చివేసి ప్రతి 6 నెలలకు ఒకసారి రెన్యువల్ చేసుకునేలా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. చాలా పాతవైన 1 నుండి బీఎస్-3 వాహనాలకు ప్రస్తుతం ఉన్న ఆరు నెలల గడువును తగ్గించి ప్రతి 3 నెలలకు ఒకసారి పొల్యూషన్ సర్టిఫికెట్ తీసుకోవడాన్ని తప్పనిసరి చేయబోతున్నట్లు సమాచారం.

పాతవాహనలను నిరుత్సాహపరిచేందుకే:

వాయు కాలుష్యానికి వాహన ఉద్గారాల వాటాను దృష్టిలో ఉంచుకుని పాత వాహనాలను ఉంచుకోకుండా ప్రజలను నిరుత్సాహపరిచేందుకు ఈ మార్పులను ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఈ మార్పుల నేపథ్యంలో రీడింగ్‌లలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూసేందుకు పీయూసీసీ ప్రక్రియను కూడా మెరుగుపరుస్తున్నట్లు సంబంధిత అధికారి ఒకరు చెప్పినట్లు నేషనల్ మీడియో పేర్కొంది.

## మెట్రో విస్తరణకు లైన్ క్లియర్.. త్వరలోనే నివేదిక



**న్యూస్ డెస్క్, 23 జూన్ (తెలుగు గళం):** హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణకై సీఎం రేవంత్ రెడ్డి.. కేంద్రమంత్రులతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. మెట్రో రైలు స్వాధీనం, సెకండ్ ఫేజ్ విస్తరణకు కేంద్రం సానుకూలంగా స్పందించింది. కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తో.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో కలిసి భేటీ అయిన సీఎం రేవంత్ రెడ్డి.. నేడు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో భేటీ అయ్యారు. ఉదయం నుంచి ఆయన నివాసంలోనే హైదరాబాద్ మెట్రో సెకండ్ ఫేజ్ విస్తరణ, ఐఆర్ఎఫ్సి రుణం, తెలంగాణలో పలు కీలక ప్రాజెక్టులపై సుదీర్ఘంగా చర్చించారు. మెట్రో ఫేజ్ -1 వాల్యుయేషన్, ఫేజ్ -2 విస్తరణకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎస్బిఐ క్యాప్స్ కన్సల్టెంట్ గా వ్యవహరిస్తుందని ఈ సమావేశంలో నిర్ణయించారు. కన్సల్టెంట్ నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని.. సీఎం, కేంద్రమంత్రులు నిర్ణయించారు. ఇందులో సమన్వయ సభ్యులుగా కేంద్ర అధికారి, రాష్ట్ర MAUD స్పెషల్ సెక్రటరీ ఉండనున్నారు.

మెట్రో ఫేజ్-1 ఆస్తుల విలువ ఎంత?, ప్రభుత్వం దానిని ఎలా టేకోవర్ చేసుకోవాలి? ఫేజ్-2 విస్తరణకు ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్సి) నుంచి తక్కువ వడ్డీకి రుణం ఎలా పొందాలి అనే విషయాలపై ఎస్బిఐ క్యాప్స్ సమగ్ర నివేదికను ఇవ్వనుంది. ఈ నివేదిక ఆధారంగానే కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ తదుపరి నిధుల విడుదలకు క్లియరెన్స్ ఇవ్వనుంది. ఈ చర్చల్లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి సమర్పించిన రెండో దశ మెట్రో విస్తరణ ప్లాన్‌లో దాదాపు 70 కిలోమీటర్ల పైగా కొత్త మార్గాలను ప్రతిపాదించినట్లు తెలుస్తోంది.

## నేరస్థుల్ని తయారుచేసే ఫ్యాక్టరీ వైసీపీ : మంత్రి నిమ్మల

మొదటి పేజీ తరువాయి




కాపులకు చంద్రబాబు 5 శాతం రిజర్వేషన్ ఇస్తే.. 2019లో జగన్ ఆ రిజర్వేషన్లను ఏకపక్షంగా రద్దు చేశారన్నారు. కాపులకు కొత్త రిజర్వేషన్ల సంగతి పక్కనపెట్టి.. ఇచ్చిన రిజర్వేషన్లను ఆనాడు నేతలంతా ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. 40 సంవత్సరాలుగా రిజర్వేషన్లు కోరుతున్న కాపులంతా నాడు ఏమైపోయారని ప్రశ్నించారు. రాష్ట్ర చరిత్రలో కాపులకు రిజర్వేషన్లు ఇచ్చింది ఇద్దరే ఇద్దరు నేతలన్న నిమ్మల.. వాటిని తొలగించిన ఘనత ముగ్గురు నేతలకు చెందుతుందన్నారు. దామోదరం సంజీవయ్య, చంద్రబాబు కాపులకు రిజర్వేషన్లిస్తే.. నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, జగన్ లు వాటిని రద్దుచేశారన్నారు.

## అయోధ్య రామాలయం విరాళాల గోల్‌మాల్.. ప్రభుత్వానికి 'సిట్' ప్రాథమిక నివేదిక సమర్పణ!

మొదటి పేజీ తరువాయి



పర్యవేక్షణ లోపం – నిర్లక్ష్యం: ఆలయ హుండీ కానుకల లెక్కింపు, భద్రత, సీసీటీవీ ఫుటేజ్ నిర్వహణ, బ్యాంకుల్లో డిపాజిట్ చేసే ప్రక్రియలో తీవ్రమైన లోపాలు, నిర్లక్ష్యం జరిగినట్లు సిట్ ప్రాథమికంగా గుర్తించింది.

ట్రస్టు సిబ్బంది పాత్ర: విరాళాల లెక్కింపు, నిర్వహణతో సంబంధం ఉన్న దాదాపు 150 మందిని (ట్రస్టు సిబ్బంది, బ్యాంకు అధికారులు, ప్రైవేట్ ఉద్యోగులు) సిట్ ప్రశ్నించింది. బంగారం, వెండి, వజ్రాల వంటి విలువైన కానుకల లెక్కలపై కొందరు ఆఫీస్ బేరర్లు ఇచ్చిన సమాధానాలు ఏమాత్రం సంతృప్తికరంగా లేవని తేలింది.

మహా కుంభమేళా సమయంలోనే అక్రమాలు: జనవరి-ఫిబ్రవరి 2025లో జరిగిన మహా కుంభమేళా సమయంలో రోజుకు దాదాపు 10 లక్షల మంది భక్తులు రావడంతో, భారీగా వచ్చిన నగదు విరాళాలను మళ్లించడంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ కుంభకోణం విలువ రూ. 200 కోట్లకు పైనే ఉండవచ్చని అంచనా.

సిట్ సిఫార్సులు – తదుపరి చర్యలు

అక్రమాలకు బాధ్యులైన వారిపై తక్షణమే అధికారికంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన విచారణ జరపాలని, దొంగిలించిన సొమ్మును రికవరీ చేయాలని సిట్ సిఫార్సు చేసింది. ఈ కేసులో ఇప్పటికే ఐదుగురు అనుమానితుల నుంచి రూ. 2 కోట్ల నగదు, ఒక ఎస్‌యూవీ వాహనం, 3 ఐఫోన్లను రికవరీ చేశారు. అలాగే, గతంలో విరాళాల లెక్కింపులో ఉన్న పాత సిబ్బంది అందరినీ విధుల నుంచి తొలగించారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదేశాల మేరకు ఈ నివేదిక సమర్పించబడగా.. రాబోయే 10 నుంచి 15 రోజుల్లో పూర్తి స్థాయి తుది నివేదికను అందజేస్తామని సిట్ సభ్యుడు విజయ్ విశ్వాస్ పంత్ తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా దోషులపై సీఎం యోగి కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉండటంతో దేశవ్యాప్తంగా ఈ వ్యవహారం సంచలనంగా మారింది.

## చేయూత పెన్షన్లలో భారీ ప్రక్షాళన అనర్హులపై పెరిగిన ఫోకస్!

మొదటి పేజీ తరువాయి

చేయూత పింఛన్ల లో చనిపోయిన వారు, గుర్తించని వారి వివరాలు

| జిల్లా | చనిపోయిన వారు | నాట్ ట్రేస్ | మొత్తం |
|---|---|---|---|
| జగిత్యాల | 5278 | 1890 | 11,047 |
| కరీంనగర్ | 3637 | 2660 | 8,460 |
| సిద్దిపేట | 5041 | 857 | 7,211 |
| సిరిసిల్ల | 2026 | 877 | 6,521 |
| కొత్తగూడెం | 3509 | 352 | 5,850 |
| హైదరాబాద్ | 1018 | 05 | 5,377 |
| పెద్దపల్లి | 3376 | 620 | 4,858 |
| నాగర్ కర్నూలు | 1431 | 711 | 4,673 |
| మంచిర్యాల | 1679 | 2377 | 4,445 |

సంబంధిత కుటుంబ సభ్యులు కూడా వారి మరణాన్ని ధృవీకరించారు. అదే విధంగా సుమారు 14 వేల మంది లబ్ధిదారులు ఎక్కడా గుర్తించలేని పరిస్థితి (నాట్ ట్రేసబుల్)లో ఉన్నట్టు తేలింది. మరో 3,475 మంది ప్రస్తుతం ఇతర రాష్ట్రాల్లో నివసిస్తున్నప్పటికీ తెలంగాణలో పెన్షన్లు పొందుతున్నట్టు గుర్తించారు. అలాగే వంద మందికి పైగా లబ్ధిదారులు స్వచ్ఛందంగా తమకు పెన్షన్ అవసరం లేదని చెప్పారు. ఉపాధి లేదా ఇతర ఆదాయ వనరులు లభించడం వల్ల వారు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇంకా సుమారు 10 వేల మంది లబ్ధిదారుల ఆధార్ కార్డులు రద్దు అయినట్టు వెలుగులోకి వచ్చింది. డూప్లికేట్ లేదా బహుళ ఆధార్ కార్డుల కారణంగా ఈ ఆధార్‌లు చెల్లుబాటు కాకపోవడం వల్ల వారి అర్హతలను కూడా ప్రభుత్వం సమీక్షిస్తోంది. ఇప్పటివరకు మొత్తం లబ్ధిదారుల్లో 83.88 శాతం మంది లైవ్ అథెంటికేషన్ పూర్తి చేసుకున్నారు. ఇంకా మూడు లక్షలకుపైగా మంది ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. లబ్ధిదారుల సౌకర్యార్థం ప్రభుత్వం ఇప్పటికే గడువును వారం రోజుల పాటు పొడిగించింది. మంచానికే పరిమితమైన వృద్ధులు, వికలాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారి ఇళ్లకే అధికారులు వెళ్లి లైవ్ అథెంటికేషన్ నిర్వహిస్తున్నారు. గతంలోనూ చేయూత పింఛన్లలో ప్రభుత్వ రిటైర్డ్? ఉద్యోగులకు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే వారికి ఇస్తున్నట్టుగా గుర్తించారు. ప్రభుత్వం నేరుగా బ్యాంకుల అకౌంట్లో చేయూత డబ్బులు జమ చేస్తుంది. అయితే వారు చనిపోయినా, ఇతర రాష్ట్రాలకు వెళ్లినా కూడా వారి సమాచారం లేకపోవడంతో వారి అకౌంట్లో డబ్బులు జమ అవుతూనే ఉన్నాయి. దీనికి అడ్డుకట్ట వేయడానికి నగరాల్లో చేయూత లబ్ధిదారుల వివరాలపై సర్వే కొనసాగిస్తున్నారు. ఇలా వీరు కూడా వేల సంఖ్యలో ఉన్నారని, వీరికి అడ్డుకట్ట వేయడం ద్వారా అనర్హులైన వారిలో కొత్త వారికి పింఛన్లు ఇవ్వవచ్చని అంచనా వేస్తున్నారు. త్వరలోనే ఈ సర్వే పూర్తి కానుంది.

## మళ్ళీ ప్రారంభమైన టెలిగ్రామ్ సేవలు




**న్యూస్ డెస్క్, 23 జూన్ (తెలుగు గళం):** నీట్ పేపర్ లీకేజీ కేసు వివాదం నేపథ్యంలో దేశంలో వారం రోజుల పాటు నిలిచిపోయిన ప్రముఖ మెసేజింగ్ యాప్ 'టెలిగ్రామ్' సేవలు మళ్లీ ప్రారంభమయ్యాయి. జూన్ 16వ తేదీ నుండి జూన్ 22వ తేదీ వరకు భారత్‌లో టెలిగ్రామ్‌పై విధించిన బ్యాన్ గడువు ముగియడంతో, యాప్ సేవలు తిరిగి యథాతథంగా పని చేస్తున్నాయి.

వారం తర్వాత పనిచేస్తున్న యాప్

నీట్ పరీక్ష పేపర్ల లీకేజీ దర్యాప్తులో భాగంగా కేంద్ర ప్రభుత్వం భారత్‌లో టెలిగ్రామ్ యాప్‌ను వారం రోజుల పాటు నిషేధించిన సంగతి తెలిసిందే. సోమవారం రాత్రితో ఈ నిషేధ గడువు ముగిసింది. దీంతో జూన్ 23 తెల్లవారుజాము నుంచి నుండి దేశవ్యాప్తంగా టెలిగ్రామ్ సేవలు మళ్లీ అందుబాటులోకి వచ్చాయి. యాప్ ఇప్పుడు ఎలాంటి అంతరాయం లేకుండా సాధారణంగా పనిచేస్తోందని, మెసేజ్‌లు పంపడం, అందుకోవడం వీలవుతోందని పలువురు వినియోగదారులు సోషల్ మీడియా ద్వారా వెల్లడిస్తున్నారు.

ప్లే స్టోర్‌లో ఇంకా రాని అప్‌డేట్

టెలిగ్రామ్ సేవలు మళ్లీ రన్ అవుతున్నప్పటికీ, గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్‌లో మాత్రం ఈ యాప్‌కు సంబంధించిన కొత్త అప్‌డేట్‌లు గానీ, కొత్తగా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం గానీ ఇంకా పూర్తిగా అందుబాటులోకి రాలేదు. ఈ సాంకేతిక ప్రక్రియ పూర్తి కావడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఫోన్లలో ముందే ఇన్‌స్టాల్ అయి ఉన్న యాప్‌లు మాత్రం ఎలాంటి ఇబ్బంది లేకుండా పనిచేస్తున్నాయి.

## పీఏసీఎస్ పదవుల పంచాయితీ

మొదటి పేజీ తరువాయి



ఒక చైర్మన్..12 మంది సభ్యులు

రాష్ట్ర వ్యాప్తంగా 908 సంఘాలు ఉండగా ఒక సంఘానికి ఒక చైర్మన్‌తో పాటు 12 మంది సభ్యులతో కొలువు దీరేందుకు ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. నామినేటెడ్ ద్వారా 11,778 మంది అధికార పార్టీ నేతలకు రాజకీయ ఉపాధి లభించనుంది. పాలకవర్గంలో ఒక ఎస్సీ మహిళ, ఒక ఎస్టీ మహిళ, ఇద్దరు బీసీ జనరల్, ఒక ఓసీ మహిళ, మరో ఏడుగురు జనరల్ సభ్యులు ఉంటారు. పదవుల్లో నియమితులయ్యే వారు ఆయా సంఘాల్లో సభ్యులై ఉండాలి. గతంలో రుణాలు తీసుకుని చెల్లించకుంటే అర్హులు కాదు. ప్రభుత్వ ఉద్యోగులు, పంచాయతీ రాజ్ సంఘాల్లో, ఇప్పటికే ఎన్నికైన ప్రజాప్రతినిధులకు అవకాశం లేదు. రెండు నెలలకితం 131 కొత్త సంఘాలు ఏర్పాటుకు జిల్లా నుంచి ప్రతిపాదనలు పంపగా, వీటికి ప్రభుత్వం ఆమోదముద్ర వేస్తే వారి దశల వారీగా ఏర్పాటు కానున్నాయి. ముందుగా పాత సంఘాలకు పాలకవర్గం ఏర్పాటు చేసి కొత్త వాటికి రెండో విడుత నియమించున్నారు.

అభ్యర్థుల ఎంపిక ఎమ్మెల్యేలకు సవాల్

పీఏసీఎస్ సంఘాలకు పాలకవర్గం అభ్యర్థుల ఎంపిక ఎమ్మెల్యేలకు సవాల్‌గా మారింది. నామినేటెడ్ విధానం కావడంతో ఆశావాహుల సంఖ్య పెరుగుతుంది. ఎన్నికల ప్రక్రియ ఉన్నప్పుడు పెద్దగా అటు వైపు ఎవరు మొగ్గు చూపేవారు కాదు. ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉండాలని, ఆర్థికంగా వెనకబడిన వారంతా పీఏసీఎస్‌ల్లో పదవులు కోసం పోటీ పడుతున్నారు. ఇప్పటివరకు పార్టీ కోసం వారు చేసిన సేవలు, ఆర్థికంగా నష్టపోయి పరిస్థితులను వివరిస్తూ ఈసారి ఎలాగైనా కట్టబెట్టాలని కోరతున్నారు. ప్రస్తుతం నియమించే కమిటీ పదవీకాలం ఆరు నెలలే ఉండటంతో మొన్నటివరకు పాలకవర్గంలో ఉన్న వారినే కొనసాగించేందుకు ఎమ్మెల్యేలు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. కొత్తవారికి ఆరు నెలల తరువాత నియమించే కమిటీలో స్థానం కల్పిస్తామని హామీ ఇస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.

కొత్త కమిటీలతో మరిన్ని సేవలు

రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు కొత్త పాలకవర్గం కొలువు దీరితే రైతులకు మెరుగైన సేవలందుతాయి. సమయానికి వ్యవసాయ రుణాలు ఇవ్వటంతోపాటు ఎరువుల విక్రయాలు, ధాన్యం కొనుగోళ్ల వేగవంతం అవుతుంది. డీసీసీబీ నుంచి వ్యవసాయ భూములపై మార్ట్‌గేజ్ రుణాలు, వ్యవసాయ యాంత్రీకరణకు రుణాలు, పశుపోషణకు రుణాలు, బంగారంపై రుణాలు అందుతాయి. పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఎరువుల విక్రయాలు సాగుతున్నాయి. ప్రైవేటు డీలర్ల వద్ద యూరియా, కాంప్లెక్స్ ఎరువుల ధరలు అధికంగా ఉండటంతో రైతులు ప్రాథమిక సహకారం సంఘాల్లో కొనుగోలు పెరుగుతుంది. యూరియా 80శాతం మేర సొసైటీల నుంచే రైతులకు అందుతోంది. పీఏసీఎస్ కేంద్రాలు ఏటా 5వేల వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు కూడా నిర్వహిస్తున్నాయి. రాయితీపై వరి, కంది, పెసర, మినుము, జనుము, జీలుగ విత్తనాలను కూడా విక్రయిస్తున్నాయి. ఈ ఖరీఫ్ సీజన్ లో రైతులకు ఇబ్బందులు రాకుండా త్వరగా పాలకవర్గం నియమించేందుకు సహకార శాఖ కసరత్తు చేస్తోంది. ఎమ్మెల్యేలు పంపిన పేర్లు నిబంధనలు ప్రకారం ఉన్నాయో లేదో పరిశీలన చేస్తున్నారు.

## పవన్‌ను అంటే ఊరుకోవద్దు.. మంత్రులకు చంద్రబాబు కీలక సూచనలు



**న్యూస్ డెస్క్, 23 జూన్ (తెలుగు గళం):** కేబినెట్ భేటీ తరవాత సీఎం చంద్రబాబు మంత్రులకు పలు సూచనలు చేశారు. వైసీపీ క్రిమినల్స్ ను వెనకేసుకుని వస్తోందని అన్నారు. కులాల మధ్య చిచ్చు పెట్టే కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పవన్ కల్యాణ్ ను అనవసరమైన విషయాల్లోకి లాగితే కూటమి ఐక్యత చాటేలా మంత్రులంతా స్పందించాలని అన్నారు. ప్రతి మంత్రి అన్ని శాఖలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. డీఎస్సీ పరీక్షపై వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. జొన్నగిరి గ్రామాన్ని స్వర్ణగిరిగా నామకరణం చేద్దామని అన్నారు. అంతే కాకుండా జూలై 3న కడక స్టీల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేద్దామని అన్నారు.

విజయవాడ సాయికృష్ణ ఘటనలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని చెప్పారు. బాధిత తల్లిదండ్రులకు ప్రభుత్వంపై నమ్మకం ఉందని వ్యాఖ్యానించారు. సాయికృష్ణ ఘటనను వైసీపీ రాజకీయం చేస్తుందని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే ఇటీవల పవన్ కల్యాణ్ సైతం తనపై వస్తున్న విమర్శలపై జనసేన మంత్రులు స్పందించాలని ఆదేశించారు. ప్రతిసారి తానే మాట్లాడటం కుదరని మంత్రులు, ఎమ్మెల్యేలు బయటకు వచ్చి కౌంటర్లు ఇవ్వాలని అన్నారు. ఇప్పుడు చంద్రబాబు సైతం తమ పార్టీ నేతలకు పవన్ కల్యాణ్ ను విమర్శించినప్పటికీ కౌంటర్లు ఇవ్వాలని ఆదేశించడం ఆసక్తికరంగా మారింది.

# రైతు ఉత్పత్తిదారుల సంఘం అభ్యున్నతికి కృషి చేయాలి

**ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి: వేంసూరు మండల వ్యవసాయాధికారి రామ్మోహన్**

**నూతన అధ్యక్షురాలిగా బి.జీవ, ఉపాధ్యక్షురాలిగా కె.విజయలక్ష్మి ఎన్నిక**



సత్తుపల్లి,ఆర్ సి,జూన్ 23(తెలుగు గళం) న్యూస్: రైతులు ప్రభుత్వం కల్పించే వివిధ రకాల రాయితీలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండల వ్యవసాయాధికారి (ఏఓ) రామ్మోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలో 'గుబ్బల మంగమ్మ తల్లి



మహిళా రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం పరిధిలోని వేంసూరు, సత్తుపల్లి మండలాల రైతు సంఘాల సభ్యుల వార్షిక సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వ్యవసాయాధికారి మాట్లాడుతూ.. మహిళా రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులను దళారుల ప్రమేయం లేకుండా లాభసాటిగా విక్రయించుకోవడానికి ఈ ఉత్పత్తిదారుల సంఘం ఒక అద్భుతమైన వేదిక అని కొనియాడారు. ఆధునిక పద్ధతులలో మార్కెటింగ్ రంగంలో రాణించాలని ఆయన సూచించారు.

**నూతన కార్యవర్గం ఎన్నిక:**

ఈ మహాసభలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షురాలి (ఛైర్మన్)గా సత్తుపల్లికి చెందిన బి.జీవ, ఉపాధ్యక్షురాలి (వైస్ చైర్మన్)గా కందుకూరుకు చెందిన కె.విజయలక్ష్మితో పాటు నూతన దర్శకులు (డైరెక్టర్లు) ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఘనంగా సత్కరించారు.సమావేశంలో భాగంగా గత ఏడాది సాధించిన ప్రగతి, ప్రస్తుత సంవత్సరంలో చేపట్టబోయే నూతన వ్యాపార, ఆర్థిక ప్రణాళికలపై సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. సంఘానికి సంబంధించిన లాభనష్టాల నివేదికను చదివి వినిపించారు. రానున్న రోజుల్లో ఏర్పాటు చేయ తలపెట్టిన వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ కేంద్రాలు, గానుగ నూనె తయారీ, ప్రకృతి వ్యవసాయ విధానాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల లభ్యత తదితర అంశాలపై సభ్యులకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో: సత్తుపల్లి, వేంసూరు మండలాల ప్రాంతీయ సమన్వయ అధికారులు (ఏపీఎం) జ్యోతి ప్రసన్న, కె.వి.సుబ్బారావు, క్షేత్ర సహాయకులు (సీసీలు) ప్రసాదరావు, షబ్బీర్, భాస్కర్, కృష్ణ, ప్రసాద్, తులసి, విక్టర్ పాల్, రామారావు, నరేందర్, సంఘ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ), గణకుడు (అకౌంటెంట్) పాల్గొన్నారు. వారితో పాటు మహిళా సమాఖ్య ప్రతినిధులు, సంఘం అధ్యక్షురాలు అనూష, కోశాధికారి జీనత్, రైతు ఉత్పత్తిదారుల సంఘాల మహిళా ప్రతినిధులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్పొరేట్లకు రాయితీలు -- సామాన్యులపై భారాలు : సిపిఎం



సత్తుపల్లి, ఆర్ సి, జూన్23 (తెలుగుగళం) న్యూస్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలకు కోట్ల రూపాయల పన్ను రాయితీలు, భూములు, సబ్సిడీలు ఇస్తూ సామాన్య ప్రజలపై మాత్రం పెట్రోల్, డీజిల్, గ్యాస్, విద్యుత్ చార్జీలు మరియు నిత్యావసర వస్తువుల ధరల రూపంలో భారాలు మోపడం దారుణమని సిపిఎం సత్తుపల్లి కమిటీ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మొరంపొడి పాండురంగారావు విమర్శించారు.

దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్ కంపెనీల చేతుల్లో కేంద్రీకరించే విధానాలను వెంటనే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ఒకవైపు నిరుద్యోగం, ధరల పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరోవైపు కార్పొరేట్ కంపెనీలకు వేల కోట్ల రుణమాఫీలు చేయడం ప్రజా వ్యతిరేక విధానమని పేర్కొన్నారు.

సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు క్షీణిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రజల సమస్యలపై దృష్టి పెట్టకుండా కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తోందని సిపిఎం ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారాలను వెంటనే తగ్గించాలని అదేవిధంగా లేదా పేద మధ్యతరగతి, అంబాల పిల్లలు చదువుకునే రోజు నుండి చదువు కొనుక్కునే రోజులుగా మార్చారని స్కూల్ ఫీజులు నియంత్రణ చేసి కార్పొరేట్ దోపిడీలు నుండి విద్యార్థులను తల్లిదండ్రులు కాపాడాలని అన్నారు అదేవిధంగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని, పేద మరియు మధ్యతరగతి ప్రజలకు ఉపశమన చర్యలు ప్రకటించాలని డిమాండ్ చేసింది.

ప్రజా సంక్షేమాన్ని పక్కనబెట్టి కార్పొరేట్ల లాభాల కోసం ప్రభుత్వాలు పనిచేస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని సిపిఎం హెచ్చరించింది. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు మరింత ఉద్ధృతం చేస్తామని సిపిఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు సిపిఎం నాయకులు రావుల రాజబాబు, చావా రమేష్, మొరంపూడి వెంకట్రావు, గుదే రాము ,చప్పిడి భాస్కర్ నాయకులు తెలిపారు.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టు రట్టు"

**నలుగురు నిందితుల అరెస్ట్.. ఇద్దరు పరార్"**

**తెలుగు రాష్ట్రాల్లో ఏడు చోట్ల చోరీలు: రూ. 11.50 లక్షల సొత్తు రికవరీ"**

**పాత నేరస్థులపై 'పీడీ యాక్ట్' నమోదుకు సన్నాహాలు: కల్లూరు డీఎస్పీ వసుంధర యాదవ్"**

సత్తుపల్లి,ఆర్ సి,జూన్ 23(తెలుగుగళం) న్యూస్: రెండు తెలుగు రాష్ట్రాల్లో వరుస దొంగతనాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న అంతర్రాష్ట్ర 'యానాది దొంగల ముఠా' గుట్టును ఖమ్మంజిల్లా సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వి.యం. బంజర పోలీసులు రట్టు చేశారు. ముఠాలోని నలుగురు కీలక సభ్యులను అరెస్ట్ చేసి, వారి నుంచి రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కల్లూరు డివిజన్ పోలీసు రక్షక శాఖాధికారి (డీఎస్పీ) శ్రీమతి వసుంధర యాదవ్ మంగళవారం విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను వెల్లడించారు.

తోటలో మాటు వేసి..

పోలీసుల కథనం ప్రకారం.. పెనుబల్లి మండలం లంకపల్లి గ్రామ శివారులోని ఓ ఫాం ఆయిల్ తోటలో ముఠా సభ్యులు ఆశ్రయం పొందుతున్నట్లు వి.యం. బంజర ఉపనిరీక్షకుడికి (ఎస్సై) నమ్మదగిన సమాచారం అందింది. దీంతో సిబ్బందితో కలిసి వెళ్లిన పోలీసులు.. తోటలో కాపలాగా ఉన్న నలుగురు నిందితులను పట్టుకున్నారు. స్థానిక పంచాయతీదారుల (సాక్షుల) సమక్షంలో వారిని విచారించగా, ముఠాగా ఏర్పడి చేసిన వరుస దొంగతనాల వివరాలను అంగీకరించారు.అరెస్టయిన వారిలో పెనుబల్లి మండలం లంకపల్లికి చెందిన మాణీకల వసంతరావు(39), మానికల రమేష్(33)లతో పాటు ఏలూరు జిల్లా చాట్రాయి మండలం తుమ్మగూడెం గ్రామానికి చెందిన పొన్నూరి కోటేశ్వరరావు(24), తుమ్మల శేఖర్(25) ఉన్నారు. కాగా, ఈ ముఠాలోని మరికొందరు నిందితులు పొన్నూరి రాంబాబు, మానికల సురేష్ ప్రస్తుతం పరారీలో ఉన్నారు.



పక్కా స్కెచ్‌తో అర్ధరాత్రి దోపిడీలు

ఈ ముఠా సభ్యులు పగటిపూట ఆటోల్లో తిరుగుతూ తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించేవారు. రాత్రి వరకు సమీపంలోని పొలాల్లో మాటు వేసి, అర్ధరాత్రి దాటిన తర్వాత గడ్డపారలతో తలుపులు, ఇనుప బీరువాల తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడేవారు. ఒకరు బయట నిఘా ఉంచగా, మిగిలిన వారు ఇంట్లోకి చొరబడి బంగారం, వెండి, నగదు దోచుకెళ్లేవారని విచారణలో తేలింది. ఏడు నేరాలు వివరణ రూ.11.50 లక్షల సొత్తు నిందితులపై ఖమ్మం, ఏలూరు జిల్లాల్లోని పలు పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలు చూస్తే

లంకపల్లిలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) నిబంధనల ప్రకారం నమోదైన కేసులో.. రూ.3.70 లక్షల విలువైన 108 గ్రాముల బంగారం, 900 గ్రాముల వెండి, రూ.20,000 నగదు చోరీ చేశారు.

పెనుబల్లి మండల పరిధిలోని అడవిమల్లెల,వి.యం. బంజర గ్రామాలలో రూ.1.80 లక్షల విలువైన 45 గ్రాముల బంగారం, రూ.5,000 విలువైన వెండి, రూ.3.70 లక్షల నగదు (మొత్తం రూ.5.55 లక్షలు) దోచుకెళ్లారు.

వేంసూరు మండల పరిధిలోని దుద్దెపూడి గ్రామంలో రూ.65,000 విలువైన 20 గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండి చోరీ.

వేంసూరు మండల పరిధిలోని కందుకూరు గ్రామంలో రెండు ఇళ్లపై దాడి చేసి ఒకచోట 20 గ్రాముల బంగారం, ఒక కిలో వెండి చోరీ చేయగా, మరో ఇంట్లో దొంగతనానికి ప్రయత్నించి విఫలమయ్యారు.

చిన్నంపేట (చాట్రాయి, ఏపీ): తాళం వేసిన ఇంట్లో చొరబడి రూ.80,000 విలువైన బంగారు ఆభరణాలు, రూ.20,000 నగదు అపహరించారు.

సత్తుపల్లి పట్టణంలో ఒక దేవాలయంలో చొరబడి రూ.5,000 విలువైన కానుకల హుండీని ఎత్తుకెళ్లారు.

ప్రవర్తన మారలేదు.. పీడీ యాక్ట్ నమోదు!

నిందితులంతా పాత నేరస్థులని, వీరిపై ఇప్పటికే వి.యం. బంజర పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ (నిఘా పట్టిక) ఉన్నప్పటికీ ప్రవర్తనలో మార్పు రాలేదని డీఎస్పీ తెలిపారు. నిందితులను రిమాండ్ నిమిత్తం సత్తుపల్లి న్యాయస్థానానికి తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ముఠాపై కొత్త చట్టాల ప్రకారం 'వ్యవస్థీకృత నేరాల' నిబంధనల కింద కేసు నమోదు చేయడంతో పాటు, పీడీ యాక్ట్ (నిర్బంధ చట్టం) నమోదుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తప్పించుకున్న మిగిలిన ఇద్దరు నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు ముమ్మరం చేశామన్నారు.

# యోగమే ఆరోగ్యానికి మార్గమని చాటిన డాక్టర్ భవాని"

**అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా డాక్టర్ భవానికి భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ సర్టిఫికెట్ అందజేత..**



సత్తుపల్లి,ఆర్ సి, జూన్ 23 ( తెలుగు గళం) న్యూస్: ఖమ్మంజిల్లా సత్తుపల్లికి చెందిన ప్రముఖ యోగా శిక్షకురాలు డాక్టర్ భవాని అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్‌లో నిర్వహించిన 108 సూర్య నమస్కారాల ఛాలెంజ్లో విశిష్ట ప్రతిభ కనబరిచి ప్రతిభా సర్టిఫికెట్‌తో పాటు అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రాణ యోగా ఒ సౌండ్ థెరపీ సెంటర్ ఆధ్వర్యంలో, భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ సహకారంతో ఘనంగా నిర్వహించారు.డాక్టర్ భవాని ప్రస్తుతం అంతర్జాతీయ యోగా ఇన్‌స్పెక్టర్‌గా వైద్యురాలుగా సేవలందిస్తున్నారు. అలాగే బెంగళూరులోని డీమ్డ్ యూనివర్సిటీలో యోగా థెరపీలో పట్టా పొందారు. సత్తుపల్లి విశ్వశాంతి విద్యాలయంలో చదువుకున్న రోజుల్లో మెడిటేషన్ మరియు యోగ శాస్త్రీయ సాంప్రదాయ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నామని అదే సిద్ధాంతాన్ని ప్రయాణ పట్ల నడుచుకుంటూ.. చిన్ననాటి నుంచే యోగా పట్ల ఆసక్తి పెంచుకుని వివిధ రాష్ట్ర, జాతీయ స్థాయి యోగా కార్యక్రమాల్లో పాల్గొంటూ విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. గత సంవత్సరం గంగారంలోని 15వ బెటాలియన్‌లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో కూడా పాల్గొన్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా డాక్టర్ భవాని మాట్లాడుతూ, యోగా అనేది కేవలం ఒకరోజు చేసే కార్యక్రమం కాదని, ప్రతిరోజూ ఉదయం క్రమం తప్పకుండా యోగాసనాలు చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. చిన్నప్పటి నుంచే పిల్లల్లో యోగా పట్ల ఆసక్తిని పెంపొందిస్తే మంచి ఆరోగ్యం, ఏకాగ్రత, వ్యక్తిత్వ వికాసం, విద్యలో ఉన్నత ఫలితాలు సాధించడంతో పాటు ఒత్తిడిని అధిగమించే సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. యోగా సంపూర్ణ ఆరోగ్యంతో కూడిన సంతోషకరమైన జీవితానికి మార్గదర్శకమని వివరించారు.ప్రాణ యోగా & సౌండ్ థెరపీ సెంటర్ నిర్వాహకులు, సహ వ్యవస్థాపకులు మాస్టర్ యోగానంద్ ఉమా బస్టోలా మాట్లాడుతూ, 108 సూర్య నమస్కారాల ఛాలెంజ్‌ను విజయవంతంగా పూర్తి చేసిన డాక్టర్ భవాని అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదల యోగా స్ఫూర్తికి నిదర్శనమని కొనియాడారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆమెకు ప్రతిభా సర్టిఫికెట్, అవార్డును ప్రదానం చేయడం తమకు ఆనందంగా ఉందని తెలిపారు.

డాక్టర్ భవాని సాధించిన ఈ విజయం యోగా రంగంలో ఆమె నిబద్ధతకు గుర్తింపుగా నిలుస్తుందని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులు ఆమెను అభినందించారు. యోగా ద్వారా ప్రతి ఒక్కరి జీవితంలో ఆరోగ్యం, జీవశక్తి, మానసిక ప్రశాంతత నెలకొనాలని వారు ఆకాంక్షించారు.

# రేగొండ రైతు వేదికలో ఘనంగా విత్తన మేళా

**ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**సన్న రకాల వరి సాగుతో బోనస్ లబ్ధి పొందాలని రైతాంగానికి పిలుపు**





తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ జూన్ 23

రైతాంగాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా రేగొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను జయశంకర్ భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మంగళవారం ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా విత్తన స్టాళ్లను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో రైతులకు నాణ్యమైన, ధృవీకరించబడిన విత్తనాలను అందుబాటులో ఉంచేందుకే ఈ మేళాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం సన్న రకాల వరి ధాన్యానికి ప్రత్యేకంగా బోనస్ అందిస్తున్న నేపథ్యంలో, రైతులు ప్రభుత్వం గుర్తించిన సన్న రకాలను సాగు చేసి ఆర్థిక ప్రయోజనం పొందాలని సూచించారు.రేగొండ రైతు వేదిక విత్తన మేళాలో రైతులకు బోనస్ వర్తించే ఖచీవీ-1638, ఖచీవీ-7715, =చీ=-15048, ఎమీ సోనా, జై శ్రీరామ్, ఔ+ూ-44, దీూ-5204 వంటి మేలైన సన్న రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు ఆయన స్పష్టం చేశారు.రైతు సోదరులందరూ ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, దళారులను ఆశ్రయించకుండా నేరుగా ప్రభుత్వ విత్తన మేళాలోనే విత్తనాలను కొనుగోలు చేసి సాగు చేపట్టాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కోరారు.ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని సూచిస్తూ.. రైతులు సాంప్రదాయక యూరియా, డీఏపీ వంటి రసాయనిక ఎరువులను అధికంగా వాడటం వల్ల భూసారం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. వాటికి ప్రత్యామ్నాయంగా మార్కెట్లోకి వచ్చిన నానో యూరియా, నానో డీఏపీ ఎరువులను వినియోగించడం ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గడమే కాకుండా భూ కాలుష్యాన్ని నివారించవచ్చని, తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్తల నివేదికలను ఉటంకిస్తూ రైతులకు అవగాహన కల్పించారు.వ్యవసాయ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ రైతులకు సలహాలు,సూచనలు అందించాలని ఆదేశించారు.ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య,ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ నడిపల్లి విజన్ రావు, కోటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం (టెంపుల్) చైర్మన్ నాయినేని సంపత్ రావు, రేగొండ సర్పంచ్ వారణాసి మౌనిక అంజి,తిరుమలగిరి సర్పంచ్ చల్లగురుగుల సుదర్శన్, రేగొండ టౌన్ అధ్యక్షులు ఏనుగు రవీందర్ రెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.వీరితో పాటు పోచంపల్లి గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యవసాయ అధికారి (డి ఏ ఓ) జే. బాపూ రావు, సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏ డి ఏ) ఎన్. రమేష్, రేగొండ మండల వ్యవసాయ అధికారి (ఏం ఏ ఓ) పెద్ది వాసుదేవరెడ్డి పాల్గొని రైతులకు సాంకేతిక వివరాలు అందించారు. అలాగే మండల వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏ ఈ వోలు) ప్రవీణ్, గోవర్ధన్, నాగరాజు, ప్రవళిక, భరత్,రేగొండ పరిసర గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన రైతు సోదరులు ఈ విత్తన మేళా ప్రారంభోత్సవంలో పాల్గొని విజయవంతం చేశారు.

# దూడల పెంచలయ్య ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి నివాళులు



నెల్లూరు జిల్లా రాపూరు (తెలుగు గళం): -ఒకే దేశం, ఒకే రాజ్యాంగం, ఒకే జెండా" అనే లక్ష్యంతో కాశ్మీర్ కోసం ప్రాణాలర్పించిన భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, ప్రాతఃస్మరణీయులు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ గారి బలిదాన్ దివస్ సందర్భంగా నెల్లూరు జిల్లా రాపూరు మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు దూడల పెంచలయ్య ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో రాపూరు మండల బీజేపీ అధ్యక్షులు దూడల పెంచలయ్య, తిక్కమనేని. వెంకటరత్నం నాయుడు, మనుబోలు. శివప్రసాద్, కరిపెం. సుబ్రహ్మణ్యం, గాలి. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు చోరీపై ప్రకటనలు అవాస్తవం

## : కొప్పుల వెంకటేశ్వర్లు(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ డైరెక్టర్)

### ప్రెస్ మీట్ లో పలు ఆసక్తికర అంశాలు వెల్లడి"

### సింగరేణి లో అత్యంత పకడ్బందీగా బొగ్గు రవాణా: చింతల శ్రీనివాస్(ఏరియా జనరల్ మేనేజర్)

### ప్రతి టన్ను బొగ్గుపై పటిష్ట పర్యవేక్షణ"

సత్తుపల్లి,ఆర్ సి,జూన్23(తెలుగుగళం) న్యూస్: బొగ్గు చోరీకు గురి అవుతుందని ఇటీవల చేస్తున్న ప్రకటనలలో ఎటువంటి నిజం లేదని అవాస్తవాలని ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు.మంగళవారం సత్తుపల్లి శివారులో గల సింగరేణి సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్ లో ముఖ్య అతిథిగా పాల్గొన్న కొప్పుల పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు.ఆయన మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతికతతో పారదర్శక రవాణా వ్యవస్థ

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ( ఎస్సీ సి సి ల్ ) మైనింగ్ రంగంలో 137 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక సంస్థ అని దేశ ఇంధన భద్రతకు వెన్నెముకగా నిలుస్తూ, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు మరియు పారిశ్రామిక వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేస్తూ జాతీయ అభివృద్ధిలో కీలక పాత్ర సింగరేణి పోషిస్తోందనీ అట్టి సిరులిచ్చే సింగరేణి సంస్థపై

ఇటీవల సింగరేణిలో బొగ్గు మాయమైందని భారీ స్థాయిలో బొగ్గు చోరీలు జరిగాయని చేస్తున్న ఆరోపణలు వాస్తవాలకు దూరంగా ఉండటమే కాకుండా సంస్థ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగుల మనోధైర్యాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయనీ తక్షణమే అట్టి వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని హితవు పలికారు.

అనంతరం జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణిలో అమలులో ఉన్న బొగ్గు రవాణా,భద్రతా వ్యవస్థలు, సాంకేతిక పర్యవేక్షణ విధానాల గురించి వివరించారు.

బొగ్గు రవాణా వ్యవస్థ : సింగరేణిలో ఉత్పత్తి అయ్యే బొగ్గులో సుమారు 85 శాతం రైల్వే మార్గం ద్వారా, మిగిలిన 15 శాతం రోడ్డు మార్గం ద్వారా వినియోగదారులకు సరఫరా చేయబడుతోందన్నారు.




బొగ్గు ఉత్పత్తి అయిన క్షణం నుంచి వినియోగదారుడి వద్దకు చేరే వరకు ప్రతి దశలో డిజిటల్ పర్యవేక్షణ, భద్రతా తనిఖీలు, ఆన్లైన్ రికార్డింగ్ వ్యవస్థలు అమల్లో ఉంటాయినీ స్పష్టం చేశారు. రోడ్డు మార్గం ద్వారా బొగ్గు రవాణా హైదరాబాద్ లోని మార్కెటింగ్ విభాగం ద్వారా ఎస్ఏపి ఆధారిత వ్యవస్థలో బొగ్గు కేటాయింపులు జరుగుతాయిన్నారు.ఏ వినియోగదారుడు ఏ గని నుంచి, ఎంత పరిమాణంలో, ఎప్పుడు బొగ్గు స్వీకరించాలో ముందుగానే డిజిటల్ గా కేటాయించబడుతుందనీ తెలిపారు. వాహనం గని లేదా కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (సి హెచ్ పి) వద్దకు చేరిన వెంటనే ఖాళీ వాహనం బరువును ఎలక్ట్రానిక్ వే బ్రిడ్జి వద్ద నమోదు అవుతుందన్నారు.వాహనం సంఖ్య, వినియోగదారుడి వివరాలు ఎస్ ఏ పి యాప్ వ్యవస్థలో నమోదవుతాయన్నారు.

నిర్దేశిత పరిమాణంలో బొగ్గు లోడింగ్ నిర్వహిస్తామన్నారు.అనంతరం ఆర్ ఎఫ్ ఐ డి,ఆధారిత బూమ్ బ్యారియర్లు కలిగిన వే బ్రిడ్జిల వద్ద మళ్లీ తూకం వేయడం జరుగుతుందన్నారు.కేటాయించిన పరిమాణానికి అనుగుణంగా బొగ్గు లోడ్ అయిన తర్వాత మాత్రమే కంప్యూటర్ జనరేట్ చేసిన అధికారిక వే-బిల్ జారీ చేసి వాహనాన్ని విడుదల చేస్తారు.వాహనం బయలుదేరిన వెంటనే ఆ సమాచారం వినియోగదారుడికి, మార్కెటింగ్ విభాగానికి, సంబంధిత అధికారులకు ఆన్లైన్ ద్వారా చేరుతుంది.జిపిఎస్ -జియోఫెన్సింగ్ ఆధారిత పర్యవేక్షణబొగ్గు రవాణా చేసే వాహనాలన్నింటికీ జిపిఎస్/ జిపిఆర్ఎస్ ట్రాకింగ్ వ్యవస్థ అమలులో ఉంది.

వాహనం ఎక్కడ ఉంది?ఏ మార్గంలో వెళ్తుంది? ఎక్కడ ఆగింది? గమ్యస్థానానికి చేరిందా? అనే వివరాలు రియల్టైమ్ లో పర్యవేక్షించబడతాయినీ డిజిటల్ స్క్రీన్ పై చూయించారు.జియోఫెన్సింగ్ సాంకేతికత కారణంగా వాహనం నిర్దేశిత మార్గం నుంచి మళ్లితే సంబంధిత గని మేనేజర్, ప్రాజెక్ట్ అధికారి, సెక్యూరిటీ ఆఫీసర్కు వెంటనే హెచ్చరికలు వెళ్తాయి.

ఆర్ ఎఫ్ ఐ డి - సీసీటీవీ - బూమ్ బ్యారియర్ల సమగ్ర నిఘా,సింగరేణి గనులు, వెయిబ్రిడ్జల్లు,సి హెచ్ పిలు, ఎంట్రీ-ఎగ్జిట్ గేట్లు, రైల్వే సైడింగ్లు, స్టాక్ యార్డుల వద్ద ఆర్ ఎఫ్ ఐ డి ఆధారిత బూమ్ బ్యారియర్లు, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయబడ్డాయి.వందలాది సీసీటీవీ కెమెరాలు 24 గంటలూ పనిచేస్తూ ప్రతి కదలికను రికార్డు చేస్తున్నాయిన్నారు.

సింగరేణిలోని అన్ని వెయిబ్రిడ్జల్లు కోల్ నెట్ డిజిటల్ వ్యవస్థకు అనుసంధానించబడ్డాయి.

ప్రతి లారీ, ప్రతి వ్యాగన్ బరువు ఆన్లైన్లో నమోదు అవుతుంది.లోడింగ్ పాయింట్ వద్ద నమోదైన బరువు, అన్లోడింగ్ సమయంలో నమోదైన బరువుతో సరిపోల్చబడుతుందన్నారు. ఏదైనా తేడా ఉంటే సంబంధిత రవాణా కాంట్రాక్టర్ నుంచి నష్టపరిహారం వసూలు చేయబడుతుంది.కాపోస్టులు- భౌతిక తనిఖీలు అన్ని ఎంట్రీ, ఎగ్జిట్ ద్వారాల వద్ద చెకోపోస్టులు,వాహనాల భౌతిక తనిఖీలు

హోలోగ్రామ్ కలిగిన అధికారిక చలానాలు ఉంటాయన్నారు. రైలు మార్గం ద్వారా బొగ్గు రవాణా ఫ్యూయల్ సప్లై అగ్రిమెంట్ల (ఎఫ్ ఎస్ ఏ) ప్రకారం విద్యుత్ కేంద్రాలు మరియు ఇతర భారీ వినియోగదారులు సింగరేణి వివిధ సిహెచ్ వి ల నుంచి బొగ్గు స్వీకరిస్తారన్నారు.రైల్వే శాఖ కేటాయించిన రేకుల్లోప్రతి వ్యాగన్కు నిర్దిష్ట పరిమాణంలో బొగ్గు లోడింగ్ జరుగుతుందన్నారు. మొత్తం ప్రక్రియ ఎస్ ఏ పి ఆధారంగా నిర్వహించబడుతుంది.లోడింగ్ పూర్తయిన వెంటనే వినియోగదారునికి డిజిటల్ సమాచారం అందుతుందన్నారు.అనంతరం రైల్వే శాఖ బొగ్గును గమ్యస్థానానికి తరలిస్తుందన్నారు.ప్రతీ రోజూ గస్తీ సింగరేణి సెక్యూరిటీతో ఉంటుందన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఆకస్మిక తనిఖీలు ఉంటాయన్నారు.చెకోపోస్టులు, స్టాక్ యార్డులు, రవాణా మార్గాలపై సర్ప్రైజ్ రైడ్లు, సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి నుంచి వినియోగదారుని వరకు ప్రతి టన్ను బొగ్గు ఆర్ ఎఫ్ ఐ డి,జిపిఎస్,సీసీ టీవీ,కోల్ నెట్,ఎలక్ట్రానిక్ వెయిబ్రిడ్జు, సింగరేణి సెక్యూరిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్లు, హోలోగ్రామ్ చలానాలు. టాస్క్ ఫోర్స్ పర్యవేక్షణ వంటి బహుళస్థాయి సాంకేతికత. భద్రతా వ్యవస్థల మధ్య నిర్వహించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో: సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ కావ్య, జె వి ఆర్ ఓసి పిఓ ప్రహ్లాద తదితర సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

# కష్టంలో కార్మికుడికి చేయూత..

## రూ.8 లక్షల సాయంతో ముందుకొచ్చిన ప్రజాప్రతినిధులు!

### చెన్నకేశవులు కుటుంబానికి అండగా రాగం నాగేందర్ యాదవ్, మెట్టు కుమార్ యాదవ్



శేరిలింగంపల్లి (తెలుగు గళం): పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఇంద్రేశం ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న త్రివేణి టాలెంట్ స్కూల్ ప్రహరీ గోడ కూలి తీవ్రంగా గాయపడిన శేరిలింగంపల్లి దూబే కాలనీకి చెందిన కూలీ చెన్నకేశవులకు కార్పొరేటర్లు అండగా నిలిచారు.ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ బాధితుడి నివాసానికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇద్దరు కార్పొరేటర్లు కలిసి బాధితుడికి రూ.8 లక్షల నష్టపరిహారాన్ని చెక్ రూపంలో అందజేశారు. వైద్య చికిత్సకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు."ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు ముందుండి ఆదుకోవడం మా బాధ్యత. ప్రజల సంక్షేమమే మా ప్రథమ కర్తవ్యం" అని కార్పొరేటర్లు పేర్కొన్నారు.కార్పొరేటర్ల సహాయానికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉప్పరి సంఘం అధ్యక్షులు శేఖర్ సాగర్, శేరిలింగంపల్లి ఉప్పరి సంఘం అధ్యక్షులు వెంకటేష్, సంఘ సభ్యులు, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఫారాలు ఇవ్వకుండానే ఇచ్చినట్లు ప్రకటనలు ఇస్తున్నారు....

## ఓటర్ నమోదు అధికారి పై చర్యలు తీసుకోవాలి...



మండపేట(తెలుగు గళం)జూన్ 23 : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) లో భాగంగా మండపేట అసెంబ్లీ నియోజక వర్గంలో ఫారాలు ఇవ్వకుండానే ఇచ్చినట్లు ప్రకటనలు చేస్తున్నారని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ మొత్తం 2,21,015 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఇప్పటి సగం మంది కి కూడా ఫారాలు ఇవ్వలేదని ఆరోపించారు. 23 తేదీ సాయంత్రం గం. 04.30 ల వరకూ బూత్ లెవెల్ అధికారులుచే 2,02,524 (91.63%) ఎన్యూమరేషన్ ఫారములను సంబంధిత ఓటర్లకు లేదా వారి కుటుంబ సభ్యులకు పంపిణీ చేసినట్లు ఓటర్ నమోదు అధికారి రాజేశ్వరరావు ప్రకటించడాన్ని ఆయన సవాల్ చేశారు. వాటిలో ఓటర్లు నుండి తిరిగి వచ్చిన 10,172 (4.60%) ఎన్యూమరేషన్ ఫారములను బూత్ లెవెల్ అధికారులు (బి.ఎల్.ఓ) యాప్ లో డేటా అప్ డేట్ (డిజిటలైజేషన్) చేశారని చెబుతున్నారని ఇవి పొంతన లేని లెక్కలు గా ఉన్నాయని ధ్వజమెత్తారు. దీనిపై ఉన్నత అధికారులు తక్షణం విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం లో అన్ని చోట్ల కన్నా ఎక్కువ శాతం చూపించాలని ఇలా తప్పుడు రిపోర్ట్ లు ఇస్తున్న ఓటరు నమోదు అధికారి టి.ఆర్.రాజేశ్వర రావు పై చర్యలు తీసుకోవాలని ప్రభాకరరావు డిమాండ్ చేశారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

# ట్రాఫిక్ కట్టడికి గ్రేహౌండ్స్ బలగం..!

## 150 మంది ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బందితో సీపీ రమేష్ సమావేశం

## ఐటీ కారిడార్ ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి.. ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలంటూ సూచనలు

గచ్చిబౌలి:(తెలుగు గళం): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి గ్రేహౌండ్స్ పోలీసు సిబ్బందిని రంగంలోకి దింపే దిశగా అడుగులు వేస్తున్నారు. ట్రాఫిక్ విధుల నిర్వహణ కోసం ప్రత్యేక శిక్షణ పొందిన 150 మంది గ్రేహౌండ్స్ సిబ్బందితో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్., సమావేశమయ్యారు.

వారం రోజుల పాటు ప్రత్యేక శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బందికి ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలతో వ్యవహరించే తీరు, చట్టపరమైన అంశాలపై కీలక సూచనలు చేశారు. హెల్మెట్ వినియోగం, లేన్ క్రమశిక్షణ, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఐటీ కారిడార్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఒత్తిడి అధికంగా ఉంటుందని, అక్కడ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచాలని, సేవాభావంతో విధులు నిర్వహిస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సిబ్బందికి సీపీ సూచించారు.



ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, ఎస్‌బీ డీసీపీ సుధీంద్ర, ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిని రెడ్డి, సైబర్ క్రైమ్ డీసీపీ సాయి మనోహర్, సీఏఆర్ ఢ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, శేరిలింగంపల్లి ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, ట్రాఫిక్ అడ్మిన్ ఏడీసీపీ నరేందర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాన్ని తనిఖీ చేసి కలెక్టర్..



నల్లగొండ (తెలుగు గళం): గ్రంథాలయాలు చదువుతోపాటు, విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని అందుకే పాఠకులతో పాటు, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. నల్గొండ జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు..స్వయంగా పాఠకులతో మాట్లాడి గ్రంథాలయంలో పుస్తకాలు, తాగునీరు, టాయిలెట్లు, ఇతర ఏమైనా సమస్యలపై అడిగి తెలుసుకున్నారు.. గ్రంథాలయంలో ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే వెంటనే తన దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని పాఠకులు, గ్రంథాలయ సిబ్బందికి తెలిపారు.. ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటూ పోటీ పరీక్షలలో విజయం సాధించాలని అన్నారు..

# రాష్ట్ర ప్రజల ఆరోగ్యమే సీఎం చంద్రబాబు లక్ష్యం..

## 35 మంది లబ్ధిదారులకు రూ.17,59,830/-సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ


## టిడిపి జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి

తెలుగు గళం న్యూస్ కడపజిల్లా జూన్ 23: జమ్మలమడుగు రాష్ట్ర ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షుడు చదిపిరాళ్ల భూపేష్ రెడ్డి పేర్కొన్నారు. జమ్మలమడుగు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టిడిపి జిల్లా అధ్యక్షులు చదిపిరాళ్ల భూపేష్ రెడ్డి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి మరియు జమ్మలమడుగు నియోజకవర్గం నుంచి ఆయా ప్రాంతాల ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని భూపేష్ రెడ్డిని కలిసి వినతి పత్రాలు సమర్పించారు. వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సంప్రదించి ప్రజల సమస్యలను కాలయాపన చేయకుండా వెంటనే పరిష్కరించాలని, కార్యాలయాల చుట్టూ ప్రజలను తిప్పు కోరాదని అధికారులకు సూచించారు. అనంతరం ముఖ్య మంత్రి సహాయనిధి పథకం కింద 35 మంది లబ్ధిదారులకు దాదావు రూ.17,59,830/- విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం భూపేష్ రెడ్డీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేద, ధనికులు అనే తేడా లేకుండా ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలందించేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా ఖర్చు చేసిన డబ్బులను తిరిగి లబ్దిదారులకు అందజేస్తున్నారని తెలిపారు. పేదల పాలిట వరంలా సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ఉందని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని రకాల సంక్షేమ పథకాలు ఎన్నికల్లో చెప్పినట్లు తూ,చా తప్పకుండా అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, దేశ ప్రధాని నరేంద్ర మోడీతో కలిసి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. అలాగే జమ్మలమడుగు నియోజక వర్గంలో స్టీల్ ప్లాంట్, సోలార్ ఫ్యాక్టరీలు తదితర పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధ్యాయ అవకాశాలు కల్పించి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి, టిడిపి నాయకులు బిర్రు సంతోష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# స్కూల్ పిల్లలకు బస్సు సౌకర్యం కల్పించండి

## డి ఎం అనిల్ కుమార్ కు వినతి పత్రం ఇచ్చిన ఎమ్మార్పీఎస్ మరియు టిడిపి నేతలు



నెల్లూరు జిల్లా రాపూరు (తెలుగు గళం):- నెల్లూరు జిల్లా రాపూరు ఎ.పి.యస్.ఆర్.టి. సి.బస్టాండ్ నుండి మద్దిలమడుగు నవాబుపేట, బొజ్జనపల్లి, వీరాయపాలెం, గి లకపాడు, తుమాయి రోడ్డు తదితర గ్రామాల నుండి వేపినాపి హైస్కూల్ కు వెళుతున్న పిల్లలకి గతంలో బస్సు సౌకర్యం ఉండేది, ప్రస్తుతం బస్సు ను నిలిపివేయడం జరిగింది. స్కూల్ పిల్లలు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గోవిందయ్య మాదిగ, టిడిపి నవాబు పేట నాయకులు సమయం ప్రసాద్, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు అడసనపల్లి వేమయ్య రాపూరు డిపో మేనేజర్ అనిల్ కుమార్ ను మంగళవారం కలిసి స్కూల్ పిల్లలకు బస్సు సౌకర్యం కల్పించాలని వినతిపత్రం సమర్పించారు. అందుకు డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించి, గతంలో స్కూల్ పిల్లల దృష్టిలో ఉంచుకొని ఉదయం 7:30 నిమిషాలకు సాయంత్రం4:30 లకు బస్సు ఏర్పాటు చేశాము, ప్రస్తుతం ఆ బస్సు కాలపరిమిత అయిపోయినందున ఆపివేసాము, ఆగస్టు నెలలో కొత్త బస్సులు వస్తాయి,నేను పై ఉన్నతాధికారులతో మాట్లాడి మూడు రోజుల్లో మీకు పూర్తి సమాచారం ఇస్తానని స్కూలు పిల్లల కోసం వీలైనంతవరకు బస్సు సౌకర్యం కల్పించడం చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల మహిళలు పాల్గొన్నారు.


Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State, Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.